06-04-2021 ఉదయము మురళి ఓంశాంతి బాప్‌దాదా మధువనము

# " మధురమైన పిల్లలారా - ఇప్పుడు ఇంటికి వాపస్ వెళ్ళాలి, అందువలన దేహ భావమును మర్చిపోయి స్వయాన్ని అశరీరి ఆత్మగా భావించండి, అందరి పై గల మమకారాన్ని తుడిచి వేయండి."

**ప్రశ్న:-** సంగమ యుగంలో పిల్లలైన మీరు తండ్రి నుండి ఎటువంటి తెలివిని నేర్చుకుంటారు ?

**జవాబు :-** తమోప్రధానము నుండి సతోప్రధానంగా ఎలా తయారవ్వాలో, ఉన్నతమైన భాగ్యాన్ని ఎలా తయారు చేసుకోవాలో ఆ తెలివిని ఇప్పుడు మీరు తండ్రి నుండి నేర్చుకుంటున్నారు. ఎవరు ఎంత యోగయుక్తంగా, జ్ఞానయుక్తంగా అవుతారో వారికి అంత ఉన్నతి జరుగుతూ ఉంటుంది. ఉన్నతిని తయారు చేసుకొను పిల్లలు ఎప్పుడూ దాగి ఉండలేరు. పిల్లల కర్మల ద్వారా ఎవరు ఎటువంటి ఉన్నతమైన భాగ్యాన్ని తయారు చేసుకుంటున్నారో తండ్రి అర్థము చేసుకుంటారు.

**పాట :-** మరణించినా నీ ఒడిలోనే..... (మర్‌నా తేరీ గలీ మే....)

ఓంశాంతి. పిల్లలందరూ ఈ పాట విన్నారు. పిల్లలనగా అన్ని సెంటర్లలోని పిల్లలు. బ్రాహ్మణులైన మనలనే ఈ పాట విన్నారా? అని బాబా అడుగుతున్నారని పిల్లలు అర్థము చేసుకుంటారు. జీవించి ఉండగానే కంఠహారంగా తయారవ్వడం అనగా మూలవతనంలోకి వెళ్ళి తండ్రి ఇంటిలో ఉండేందుకు పిల్లలు ఈ పాట విన్నారు. మూలవతనం శివబాబా ఇల్లు కదా. అందులో అన్ని సాలిగ్రామాలు(ఆత్మలు) ఉంటాయి. బ్రాహ్మణ కులభూషణులు, స్వదర్శన చక్రధారులైన పిల్లలు బాబాయే వచ్చారని అర్థం చేసుకున్నారు. వారంటున్నారు - ఇప్పుడు మీరు అశరీరిగా తయారవ్వాలి అనగా దేహ భావాన్ని మర్చిపోవాలి. ఎందుకంటే ఈ ప్రపంచమే సమాప్తమైపోతుంది. కావున ఇప్పుడు వాపస్ ఇంటికి వెళ్ళాలి. పిల్లలందరికి ఇప్పుడు సంతోషము కలుగుతుంది, ఎందుకంటే ఇంటికి వెళ్ళేందుకు అర్ధకల్పము అనేక ఎదురు దెబ్బలు తిన్నారు. అయినా దారి లభించలేదు. అంతేకాక భక్తి మార్గములోని బాహ్య ఆడంబరాలు చూచి మనుష్యులు చిక్కుకుపోయారు. ఇది భక్తిమార్గపు ఊబి! ఇందులో మనుష్యులు గొంతు వరకు కూరుకుపోయారు. ఇప్పుడు పిల్లలంటున్నారు - " బాబా, ఇప్పుడు మేము ఈ పాత ప్రపంచాన్ని, పాత శరీరాన్ని మర్చిపోతాము. ఇప్పుడు అశరీరులుగా అయి మీతో పాటు ఇంటికి వస్తాము." మనలను తీసుకెళ్ళేందుకు పరమపిత పరమాత్మ పరంధామము నుండి వచ్చారని అందరి బుద్ధిలో ఉంది. కేవలం పవిత్రంగా అయి నన్ను స్మృతి చేయమని బాబా చెప్తున్నారు. జీవించి ఉండి మరణించాలి. అక్కడ ఇంట్లో ఆత్మలుంటాయని మీకు తెలుసు. ఆత్మలన్నీ బిందువులే. ఆత్మలన్నీ నిరాకార ప్రపంచంలోకి వెళ్ళిపోతాయి. మనుష్యులెంత మంది ఉన్నారో అన్ని ఆత్మలు అక్కడ ఉంటాయి. ఆత్మలు ఆ మహాతత్వంలో ఎంత స్థలంలో ఉంటాయి? శరీరమైతే ఇంత పెద్దది. ఎంత స్థలము తీసుకుంటుంది? పోతే ఆత్మలకు ఎంత స్థలము కావాలి? ఆత్మలైన మనము ఎంత కొద్ది స్థలము తీసుకుంటాము? చాలా తక్కువ స్థలము. తండ్రి ద్వారా ఈ విషయాలన్నీ వినే సౌభాగ్యము పిల్లలకిప్పుడు లభించింది. తండ్రి అర్థం చేయిస్తున్నారు - మీరు ఇక్కడకు శరీరము లేకుండా వచ్చారు. తర్వాత శరీరాన్ని ధరించి పాత్రను అభినయించారు. ఇప్పుడు మళ్ళీ జీవించి ఉండి మరణించాలి, అందరినీ

మర్చిపోవాలి. తండ్రి వచ్చి మరణించడం నేర్పిస్తున్నారు. మీరు మీ తండ్రిని, ఇంటిని స్మృతి చేయమని, బాగా పురుషార్థము చేయమని వారంటున్నారు. యోగము చేసినందున పాపాలు నశిస్తాయి. మళ్ళీ ఆత్మ తమోప్రధానము నుండి సతోప్రధానమైపోతుంది. అందువలన తండ్రి సలహా ఇస్తున్నారు - కల్పక్రితము కూడా దేహ సర్వ సంబంధాలు వదిలి నన్నొక్కరినే స్మృతి చేయమని చెప్పాను. అందరికీ తండ్రి వారొక్కరే కదా. మీరు ప్రజాపిత బ్రహ్మ ముఖవంశావళి పిల్లలు మీరు జ్ఞానాన్ని పొందుతున్నారు. మీరంతా శివుని పిల్లలే. మనము భగవంతుని పిల్లలమని అందరికీ నిశ్చయముంది. కాని వారి నామ, రూప, దేశ, కాలాలు మర్చిపోయిన కారణంగా భగవంతుని పై అంతగా ఎవ్వరికీ ప్రేమ లేదు. బాబా ఎవ్వరి పై దోషమును ఆపాదించరు. ఇది కూడా డ్రామాలో నిశ్చయింపబడిందని అంటారు.

తండ్రి అర్థం చేయిస్తున్నారు - మీరు ఆత్మలు చాలా సూక్ష్మమైన బిందువులు, ఆ బిందువులో 84 జన్మల పాత్ర నిండి ఉంది. ఆత్మ శరీరము తీసుకొని పాత్ర ఎలా చేస్తుందో అది చాలా అద్భుతమైనది. ఇప్పుడు మీకు అనంతమైన పాత్రను గురించి తెలిసింది. ఈ జ్ఞానము ఇతరులెవ్వరికీ తెలియదు. మీరు కూడా దేహాభిమానములో ఉండేవారు, ఇప్పుడు ఎంతో మారిపోయారు. అది కూడా ప్రతి ఒక్కరి భాగ్యమునననుసరించి ఉంది. కల్పక్రితపు భాగ్యము ఇప్పుడు సాక్షాత్కారమవుతూ ఉంది. ప్రపంచంలో మనుష్యులు అనేకమంది ఉన్నారు. ప్రతి ఒక్కరికి వారి వారి భాగ్యము వేరు వేరుగా ఉంది. ఎటువంటి కర్మలు చేశారో దాని అనుసారము సుఖ-దు:ఖాలను అనుభవిస్తూ ఉంటారు. ధనవంతులుగా, పేదవారిగా అవుతూ ఉంటారు. అలా అయ్యేది ఆత్మనే. ఆత్మ ఎలా సుఖీగా, ఎలా దు:ఖీగా అవుతుందో తండ్రి కూర్చుని అర్థము చేయిస్తున్నారు. తమోప్రధానము నుండి సతోప్రధానంగా అయ్యే తెలివిని కల్పక్రితము వలె తండ్రే నేర్పిస్తున్నారు. కల్పక్రితము ఎవరెంత తెలివి పొందుకున్నారో, ఇప్పుడు కూడా అంతే పొందుతున్నారు. చివరికి ప్రతి ఒక్కరూ తమ భాగ్యాన్ని అర్థం చేసుకుంటారు. కల్ప-కల్పము ఇటువంటి భాగ్యమే ఉంటుందని అప్పుడంటారు. ఎవరైతే యోగయుక్తంగా, జ్ఞానయుక్తంగా ఉంటారో వారు సేవ కూడా చేస్తూ ఉంటారు. చదువులో సదా ఉన్నతి అవుతూ ఉంటుంది. కొంతమంది పిల్లలు చాలా త్వరగా ఉన్నతి చెందుతారు. కొంతమంది తలను పాడు చేస్తూ ఉంటారు(కష్టపెడ్తూ ఉంటారు). ఇక్కడ కూడా అలాంటివారు ఉన్నారు. కల్పక్రితము వలె ఎవరెవరు ఉన్నతి చేసుకున్నారో, వారు గుప్తంగా ఉండలేరు. తండ్రికి తెలుసు కదా. అందరి సంబంధము శివబాబాతోనే ఉంది. ఈ బ్రహ్మ కూడా పిల్లల కర్మలు చూసి అర్థము చేసుకుంటాడు కనుక శివబాబా కూడా చూస్తూ ఉంటారు. భలే ఈ బ్రహ్మ నుండి ఎవరైనా దాచినా, శివబాబా వద్ద ఎవరూ దాచలేరు. భక్తిమార్గములోనే పరమాత్మ నుండి దాచలేరంటే మరి జ్ఞానమార్గంలో ఎలా దాచగలరు! తండ్రి అర్థం చేయిస్తున్నారు - ఈ చదువు చాలా సహజమైనది. కర్మలు కూడా చేయాలి. పాత ప్రపంచములోని బంధు-మిత్రులతోనే ఉండాలి. అక్కడ ఉండి శ్రమ చేయాలి. ఇక్కడ ఉండి పురుషార్థము చేయువారి కంటే అక్కడ ఇంట్లో ఉండి పురుషార్థము చేయువారు చాలా తీక్షణంగా ఉంటారు. ఒకవేళ అంత పట్టుదల ఉంటే అవ్వగలరు. శాస్త్రాలలో అర్జునుడు, ఏకలవ్యుని ఉదాహరణ ఉంది కదా. కోయవాడు(ఏకలవ్యుడు) వెలుపల ఉండి కూడా అభ్యాసము ద్వారా బాణాలు వేయడంలో అతను అర్జునుని కంటే తెలివిగలవాడైపోయాడు. కావున గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా ఉండాలి. ఈ ఉదాహరణను కూడా మీరు చూస్తారు. గృహస్థ వ్యవహారములో ఉంటూ చాలా మంచి సేవ చేయవచ్చు. వారు చాలా ఉన్నతి పొందుతూ ఉంటారు. ఇక్కడ ఉండేవారిని కూడా మాయ వదలదు.

బాబా వద్దకు వస్తూనే ముక్తులైపోతారని కాదు. లేదు, ప్రతి ఒక్కరిదీ ఎవరి పురుషార్థము వారిదే. గృహస్థ వ్యవహారంలో ఉండేవారు ఇక్కడ ఉండేవారి కంటే మంచి పురుషార్థము చేయవచ్చు. చాలా మంచి పరాక్రమాన్ని చూపవచ్చును. వారినే మహావీరులని అంటారు. గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా ఉండి చూపించాలి. బాబా మీరు వదిలేశారని కొందరంటారు. బాబా అంటున్నారు - "నేనెక్కడ వదిలాను, నన్ను వదిలిపెట్టి మీరే వెళ్ళిపోయారు." బాబా ఎవ్వరినీ వదిలి రాలేదు. పిల్లలే వదిలిపెట్టి వెళ్ళారు. ఈశ్వరీయ సేవ చేయమని బాబా కన్యలకు చెప్తారు. ఇతను కూడా బాబానే. వారు కూడా బాబానే. కుమారులు కూడా చాలామంది వచ్చారు. కాని నడవలేక పోయారు. కన్యలే బాగున్నారు. ఒక కన్య వంద బ్రాహ్మణుల కంటే ఉత్తమంగా లెక్కింపబడ్తుంది. కన్య అనగా 21 కులాలను ఉద్ధరించాలి, జ్ఞాన బాణాలు వేయాలి. గృహస్థంలో ఉండేవారు కూడా బి.కెలే అయ్యారు. పోను పోను వారి బంధనాలు కూడా సమాప్తమైపోతాయి. సేవ అయితే చేయాలి కదా! చాలా మంది సేవ చేసే పిల్లలు బాప్‌దాదా హృదయాన్ని అధిరోహించి ఉన్నారు. వారు వేలాది మందికి కళ్యాణము చేస్తున్నారు. ఇటువంటి సేవాధారి పిల్లలకు ఆశీర్వాదాలు కూడా లభిస్తూ ఉంటాయి. వారు హృదయాన్ని అధిరోహించే ఉంటారు. హృదయము పై ఉండువారే సింహాసనము పై కూర్చుంటారు. బాబా అంటున్నారు - పరస్పరంలో కలిసి అందరికి మార్గము చూపేందుకు యుక్తులు రచిస్తూ ఉండండి. చిత్రాలు కూడా తయారౌతూ ఉంటాయి. ఇవన్నీ ప్రాక్టికల్ విషయాలు.

ఇప్పుడు మీరు అర్థం చేయిస్తారు - పరమపిత పరమాత్మ నిరాకారులు, వారు కూడా బిందువే కాని వారు జ్ఞాన సాగరులు, పతిత పావనులు. ఆత్మ కూడా బిందువే. పిల్లలు చిన్నవారుగా ఉంటారు. తండ్రికి, పిల్లలకు తేడా ఉంటుంది కదా. ఈ రోజులలో 15-16 సంవత్సరాల వారు కూడా తండ్రిగా అవుతున్నారు. అయినా పుత్రుడు తండ్రి కంటే చిన్నవాడే కదా. కాని ఇక్కడ విచిత్రము చూడండి - తండ్రి కూడా ఆత్మనే, కొడుకు కూడా ఆత్మనే. వారు పరమ ఆత్మ, జ్ఞానసాగరులు. మిగిలినవారంతా తమ చదువు అనుసారము ఉన్నతపదవి లేక కనిష్ఠ పదవిని పొందుతారు. మొత్తం ఆధారమంతా చదువు పైనే ఉంది. మంచి కర్మలు చేసినందున ఉన్నత పదవిని పొందుతారు. ఇప్పుడు పిల్లలైన మీకు సృష్టి ఆదిమధ్యాంతాల జ్ఞానముంది. స్వర్గంలో కేవలం భారతదేశం మాత్రమే ఉండేది. ఇంకే ఖండమూ ఉండేది కాదు. కావున చిన్న కొత్త భారతదేశంలో మన స్వర్గాన్ని చూపించండి. ఉదాహరణకు ద్వారక అను పేరు లేదు, దానికి బదులు లక్ష్మీనారాయణుల రాజ్యమని వ్రాయాలి. సత్యయుగములో మొదట దైవీ వంశీయుల రాజ్యముంటుందని బుద్ధి కూడా చెప్తుంది. వారికి చిన్న - చిన్న గ్రామములుండేవి, చిన్న-చిన్న ప్రదేశాలు ఉంటాయి. ఇది కూడా విచార సాగర మథనము చేయాలి. దీనితో పాటు శివబాబాతో బుద్ధియోగాన్ని జోడించాలి. మనము స్మృతి ద్వారానే చక్రవర్తి పదవిని తీసుకుంటాము. స్మృతి ద్వారానే తుప్పు వదిలి పోతుంది. మొత్తం శ్రమ అంతా ఇందులోనే ఉంది. చాలామంది బుద్ధి ఇతర వైపులకు పోతూ ఉంటుంది, ఇక్కడ కూర్చుని ఉన్నా పూర్తి సమయమంతా స్మృతిలో ఉండలేరు. బుద్ధి ఇతర వైపులకు వెళ్ళిపోతుంది. భక్తిమార్గంలో కూడా అలాగే జరుగుతూ ఉంటుంది. శ్రీ కృష్ణుని భక్తి చేస్తూ చేస్తూ బుద్ధి మరోవైపుకు వెళ్ళిపోతుంది. తీవ్రమైన (నౌధా భక్తి ) భక్తి చేయువారు సాక్షాత్కారము కొరకు చాలా శ్రమ చేస్తారు. కృష్ణుడు తప్ప ఎవరూ గుర్తుకు రాకూడదని గంటల తరబడి కూర్చుంటారు. చాలా శ్రమ చేస్తారు. ఇందులో 8 మణులు, 16,

108 మణుల మాలలు ఉంటాయి. అక్కడ లక్షల మాలను కూడా చూపిస్తారు. కాని జ్ఞానమార్గంలోని మాల చాలా విలువైనది. భక్తిమార్గములోని మాల చౌక అయినది, ఎందుకంటే ఇందులో ఆత్మిక శ్రమ ఉంది. కృష్ణుని చూస్తూనే సంతోషంగా నృత్యము చేస్తారు. భక్తికి, జ్ఞానానికి రాత్రి పగలుకు ఉన్నంత తేడా ఉంది. శ్రీ కృష్ణుని స్మృతి చేస్తే తుప్పు వదిలి పోతుందని అక్కడ చెప్పరు. ఇక్కడ తండ్రిని ఎంత స్మృతి చేస్తారో అంతగా పాపాలు నశిస్తాయని అర్థం చేయిస్తారు.

పిల్లలైన మీరిప్పుడు యోగబలము ద్వారా విశ్వానికి యజమానులుగా అవుతారు. ఇది స్వప్నంలో కూడా ఎవరి ఆలోచనకు అందదు. లక్ష్మీనారాయణులు ఎలాంటి యుద్ధాలు మొదలైనవి చెయ్యలేదు. వారు విశ్వానికి యజమానులుగా ఎలా అయ్యారో పిల్లలైన మీకు మాత్రమే తెలుసు. తండ్రి అంటున్నారు - యోగబలము ద్వారా మీకు రాజ్యము లభిస్తుంది. కాని భాగ్యంలో లేకుంటే పురుషార్థమే చేయరు. సేవా యోగ్యులుగా అవ్వరు. బాబా ఏమో - " ఈ విధంగా పదర్శినీలు చెయ్యండి అని సూచనలిస్తూనే ఉంటారు. కనీసం ఒక రోజులో 150 మంది 200 ప్రదర్శనలు వేయాలి. పల్లె పల్లెలో తిరగండి. ఎన్ని సెంటర్లు ఉన్నాయో అన్ని ప్రదర్శినీలు జరగాలి. ఒక్కొక్క సెంటర్‌లో ప్రదర్శినీ చిత్రాలు ఉన్నందున అర్థము చేయించడం సులభమౌతుంది. సెంటర్లు కూడా పోను పోను చిత్రాలుంచుకునేందుకు వీలుగా పెద్ద పెద్దవిగా తయారౌతాయి. కొత్త చిత్రాలు కూడా తయారుచేస్తూ ఉంటారు. వైకుంఠ సమయంలోని భారతదేశంలో ఉన్న అందమైన భవనాలు మొదలైన వాటి చిత్రాలు తయారు చేయాలి. పోను పోను అర్థము చేయించేందుకు మంచి మంచి చిత్రాలు తయారౌతూ ఉంటాయి. వానప్రస్థ స్థితిలోని వారు మెల్లగా నడుస్తూ - తిరుగుతూ కూడా సేవ చేయవచ్చు. ఎవరి భాగ్యము ఉదయమవుతుందో వారు తయారౌతారు. చాలామంది పిల్లలు కుకర్మలు చేసి తమ గౌరవాన్ని పాడు చేసుకొని యజ్ఞ గౌరవాన్ని కూడా భంగపరుస్తారు. ఎటువంటి నడవడికలు ఉంటాయో అటువంటి పదవి లభిస్తుంది. ఎవరైతే అనేకమందికి సుఖమునిస్తారో వారి పేర్లు మహిమ చేయబడ్తాయి కదా. ఇప్పుడింకా అన్ని గుణాలలో సంపన్నంగా అవ్వలేదు కదా. కొంతమంది చాలా మంచి సేవ చేస్తున్నారు. అటువంటి వారి పేర్లు విని బాబా చాలా సంతోషిస్తారు. సేవాధారి పిల్లలను చూసి బాబా సంతోషిస్తారు. వారు సేవలో బాగా శ్రమ చేస్తూ ఉంటారు. సెంటర్లు కూడా తెరుస్తూ ఉంటారు. దాని ద్వారా వేలాది మంది కళ్యాణము జరుగుతుంది. వారి ద్వారా మళ్ళీ చాలామంది వస్తారు. ఇంకా ఎవ్వరూ సంపూర్ణులు అవ్వలేదు. ఏవో కొన్ని తప్పులు కూడా జరుగుతూ ఉంటాయి. మాయ వదిలిపెట్టదు. ఎంత ఎక్కువ సేవ చేసి, తమ ఉన్నతి చేసుకుంటారో వారు హృదయముపై అంత ఎక్కువగా అధిరోహిస్తారు, అంత ఉన్నత పదవిని కూడా పొందుతారు. మళ్ళీ కల్ప-కల్పము అలాంటి పదవే వారికి లభిస్తుంది. శివబాబా వద్ద ఎవ్వరూ దాచలేరు. అంతిమంలో ప్రతి ఒక్కరికి తమ కర్మలన్నీ సాక్షాత్కారమౌతాయి. తర్వాత ఏమీ చేయలేరు. వెక్కి-వెక్కి ఏడ్వవలసి వస్తుంది. అందువలన బాబా అర్థము చేయిస్తూ ఉంటారు - చివరి సమయంలో శిక్షలు అనుభవించే, పశ్చాత్తాపపడే కర్మలు ఏవీ చేయకండి. కాని ఎంతగా అర్థము చేయించినా భాగ్యంలో లేకుంటే పురుషార్థము చేయనే చేయరు. ఈ రోజులలోని మనుష్యులకు తండ్రి అంటే ఎవరో తెలియదు. భగవంతుని స్మృతి చేస్తారు కాని వారెవరో తెలియదు. భగవంతుడు చెప్పేది వారు వినరు. ఇప్పుడు ఆ అనంతమైన తండ్రి నుండి మీకు సత్యయుగ స్వరాజ్య వారసత్వము ఒక్క సెకెండులో లభిస్తుంది. శివబాబా పేరును అందరూ ఇష్టపడ్తారు కదా. ఆ అనంతమైన తండ్రి నుండి స్వర్గ వారసత్వము లభిస్తూ ఉందని పిల్లలకు తెలుసు. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. మీ నడవడికల ద్వారా తండ్రి పేరును, యజ్ఞము పేరును ప్రఖ్యాతం చేయాలి. తండ్రి గౌరవాన్ని పోగొట్టే కర్మలేవీ చేయరాదు. సేవ ద్వారా మీ భాగ్యాన్ని మీరే తయారు చేసుకోవాలి.
2. తండ్రి సమానం కళ్యాణకారులుగా అయి అందరి ఆశీర్వాదాలు తీసుకొని ప్రథమ స్థానాన్ని పొందుకోవాలి. గృహస్థ వ్యవహారంలో ఉంటూ కమలపుష్ప సమానంగా ఉండేందుకు మంచి సాహసాన్ని చూపించాలి.

## వరదానము :- " సహయోగం ద్వారా స్వయాన్ని రాజయోగిగా చేసుకునే నిరంతర యోగీ భవ "

సంగమయుగంలో తండ్రికి సహయోగిగా అవ్వడమే సహజయోగిగా అయ్యే విధి. ఎవరి ప్రతి సంకల్పము, మాట(శబ్దము) మరియు కర్మ తండ్రి కర్తవ్యము లేక మీ రాజ్యస్థాపనా కర్తవ్యంలో సహయోగిగా ఉంటుందో వారిని జ్ఞానయుక్త, యోగయుక్త ఆత్మలు లేక నిరంతర సత్యమైన సేవాధారులని అంటారు. మనసుతో గాని, శరీరంతో గాని, ధనముతో గాని ఇవేవీ కాకుంటే ఎందులో సహయోగులుగా అవ్వగలరో అందులో అయితే అది కూడా యోగమే. తండ్రివారిగా అవ్వనే అయ్యారు. కనుక తండ్రి మరియు మీరు - మూడవ వారెవ్వరూ లేరు - దీని ద్వారా మీరు నిరంతర యోగులుగా అవుతారు.

## స్లోగన్ :- " సంగమ యుగంలో సహనం చేయడం అనగా మరణించడమే, అదే స్వర్గ రాజ్యం తీసుకోవడం. "